# ○ బేదాభిప్రాయాలు ○

✳ శ్రీ సంజీవరావు ✳

నారాయణ, సనాతనుడు, పూర్వాభిప్రాయాలుగల వాడు, అందరినీ, ముఖ్యంగా తనభార్యను తీవ్రంగా అనుమానించేవాడున్నూ. కొంచం సినిక్ అనికూడా చెప్పవలసి ఉంటుంది. సుందరమ్మ నవయుగానికి చెందింది. నిండుయవ్వనం, సినిమాలు, షోకులు, నవలలు అవిన్నూ, వీళ్లిద్దరి అభిప్రాయాలకు లడాఫట్. భార్య నవలలు చదువుతూంటే "ఆవేశవ' పుస్తకాలు చదవటం మానేయవటే. హరిహరీ, పాడుముండా పుస్తకాలు ఎక్కడదాపురించారో నాకొంపతీయడాన్కి. చదువుకున్నవాడు చదువులేనివాడు అందరూ చదవటమే ఈకొవ్వలి నవలలు, మాలాంటి సంసారాల్ని పాడుచెయ్యడాన్కి పుట్టాడు ఆమహానుభావుడు" అంటూఉండేవాడు. నిజానికి తనకు "ఈనవలలుచదివి ఏపాడుబుద్ధులు పుడ్తాయో" అనే అనుమానం. దినదినం తిరగేస్తుంది. అందుకనే, తనకు ఇష్టంలేకపోయినా, చచ్చినట్టు భార్యను అనుసరించాల్సిందే సినిమాలకు. "తాను లేకపోతే, ఆసినిమాల్లో,... ఎవడ్నోచూసి,...ఏమో ఈపాడులోకంలో ఎవర్నీ నమ్మకూడదు" ఇలాంటి అభిప్రాయాలు, తన్ని బలవంతంగా భార్యవెంట పంపిస్తున్నాయి. సుందరం, మాత్రం నవ్వి "అయినా మావెఱ్ఱిగాని సినిమాలు, పుస్తకాలు, చూసినంతమాత్రాన, శీలం పాడయిపోతుందుటండీ" అనేసి ఊరుకుండేది. "ఆహా, కాకపోతే, ఈదినాల్లో, వెధవముండల వివాహాలు, లేచిపోటం, ఇవన్నీ ముందుండేయా చెప్పు సుందూ!" ఇది ఆయన సమాధానం. ఏదిఏలాగయినా, భార్యనవలలు చదవటం, భర్తగారు చీవాట్లుపెట్టడం, దినకృత్యాల్లో ఒకటయిపోయింది.

ఆ ఊళ్లో, ఒక చౌక సినిమాహాలుంది. అక్కడ "తుపాకిగుండు, ఫిరంగిదెబ్బ" యిలాంటివి బుక్కవుతుండాయి. వాటికి వచ్చేడబ్బుకూడా బోలెడు. ఒకదినం ఇలాంటిదేవచ్చింది. అది గొప్పగా ఉందని, కథానాయికి చక్కగా ఉందని, ప్రతివాని నోట్లో ఉన్నాయి ఈముక్కలు. జనులు తండోపతండోపలుగా వెళ్లుతున్నారు. సుందరమ్మ హృదయంలో ఆందోళన హెచ్చయింది. ఇహఉండలేక "ఈదినం తప్పకుండా వెళ్లాలండీ. అప్పుడే రెండు రోజులయ్యాయి. ఎక్కువరోజులుకూడా ఉండదట" అని విన్నవించింది. కొంతసేపటికి భర్తగారినోట "ఊ" అన్నమాట విన్పించింది. ఆనాసం హడావిడి జాస్తి అయింది. వంట పెందలాడేచేసి, జట్కా తెప్పించి, ఇంటికి తాళంవేసి, బయలుదేరారు ఆదర్శదంపతులిరువురున్నూ.

సినిమాలో జనం క్రిక్కిరిసిఉన్నారు. కథ ప్రారంభమయింది. కథానాయికి అమాంతంగా ఎగిరిపోతుంటే, శత్రునాశనం చేస్తుంటే "రంయ్" మంటూ గుర్రంమీద వెళ్లిపోతుంటే, జనం దంగయిపోయి అట్టే చూస్తున్నారు. కథానాయికి, భర్తఉండగా, ఇంకోడిని ప్రేమిస్తుంది. వీళ్లిద్దరి, ప్రణయం, ముద్దులు, నవ్వులాటలు, నగ్నచిత్రాలు చూస్తుంటే, ఆడియన్స్‌లోనుండి, చప్పట్లు, కరతాళధ్వనులు, విజిల్సు హాలంతా ప్రతిధ్వనించాయి. నారాయణ ఉండలేకపోయాడు "మొగుడుండగానే ఇంకోడితో ముద్దులాటలేమిటిరా, శ్రీరామచంద్ర" అంటూ ఉక్కిరిబిక్కిరయిపోతున్నాడు. ఆఖరకు సినిమాఅయిపోయింది. సుందరమ్మ నిద్రలేచిన దానిలాగు అతాత్తుగాలేచింది. బుర్రలో ఆలోచనాపరంపరలు పరుగెత్తేయి. ఇంటికి చేరగానే, అపాళంగా పడుకున్నారు. సుందరమ్మకి నిద్దరలేదు, సినిమాసంగతులు, వాళ్లింటిప్రక్క మోహనరావు ఆదినం, వెన్నెలరాత్రిలో, దానిమ్మచెట్టుక్రింద వాళ్లిద్దరు మాట్లాడ్డం, ఇవిన్నూ జ్ఞాపకానికి వస్తున్నాయి.

రెండురోజులు ఇంట్లో పరిస్థితులు తారుమారుగా ఉన్నాయి. భార్యాభర్త పటపటాలు ఎక్కువయిపోయాయి. మూడోరోజు తెల్లవారేసరికి సుందరమ్మ లేదు. ఇల్లంతా వెదికి మొత్తుకున్నాడు నారాయణ. అంతలో ప్రక్కయింట్లో గొల్లుమన్నారు. సంగతి సమాచారాలు కనుక్కుంటే, మోహనరావు లేడని వార్త తెలిసింది.

కొన్నిరోజులయాక ఒక ఉత్తరం వచ్చింది, అది ఇలాగుంది—

సనాతన మహరాజ్,

మనసులేని కాపురంకన్నా చల్లగా లేచిపోడం ఉత్తమమని తోచిందినాకు. మోహనరావుని నేను ప్రేమించాను. ఆయన ఒకకాలేజి విద్యార్థి. ఆయన ఆదర్శాలు, అభిప్రాయాలు, నాఆదర్శాలు వాంఛలు సరిపోతున్నాయి. మీకు చాలా శ్రమఇచ్చాను. మీరుమాత్రం, నాకోసం శ్రమపడకండి, మీకు నచ్చిన ఒకసనాతనపిల్లను తెచ్చి పెండ్లిచేసుకోండి.

నేనుచేసిన అపరాధాన్ని క్షమిస్తారని నమ్ముతున్నాను.

ఇట్లు,

మీ "సుందు"